క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



వరికుంటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతిపూజను పదోతరగతి విద్యార్థినులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎస్వీ వరప్రసాద్ దాతగా వ్యవహరించి పూజాసామగ్రి సమకూర్చారు. ఇటీవల సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ప్రతి శుక్రవారం పదోతరగతి విద్యార్థినులు పూజలు నిర్వహిస్తున్నారు. పూజకు అవసరమైన సామగ్రిని వారానికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున దాతగా వ్యవహరించి సమకూర్చుతున్నారు.

104 వాహన సేవలు

వరికుంటపాడు : మండలంలోని తూర్పుకొండారెడ్డిపల్లెలో 104 వాహన సేవలను శుక్రవారం అందజేశారు. వైద్యాధికారిణి ఆయేషా 50 మందిని పరీక్షించి మందులను అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

వర్షం పడితే నరకమే



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు పంచాయతీ మజరా గ్రామమైన కమ్మవారిపాళేనికి వెళ్లే రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. వర్షం పడితే గుంతలో నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తోంది. ఈ కారణంగా వాహనచోదకు లు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సు, కారు ఢీ

ఉదయగిరి: స్థానిక ట్యాంక్‌బండ్‌పై వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. స్థానికుల వివరాల మేరకు.. సీతారామపురం మండలం చిన్ననాగంపల్లికి చెందిన వ్యక్తులు కారులో ఉదయగిరి కోర్టుకు కేసు వాయిదా నిమిత్తం వచ్చారు. వారిలో ఒకరిని బస్టాండ్‌లో వదిలి మళ్లీ కోర్టు వద్దకు వచ్చే క్రమంలో ఉదయగిరి–కావలి మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఎవరూ గాయపడ లేదు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఘటనకు కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎస్సై శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సంగం: సంగం–కలిగిరి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. వివరాలు.. కలిగిరి వైపు నుంచి టాటాఏస్ వాహనాన్ని తీసుకొస్తున్న రికవరీ వ్యాన్‌ను వెనుక వైపుగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రికవరీ వ్యాన్‌తో పాటు టాటాఏస్ వాహనం పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారులోని వ్యక్తి స్వల్ప గాయాలవగా ఆస్పత్రికి తరలించారు. సీఐ వేమారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

కలుషిత నీటితో చేపలు మృత్యువాత



అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్ కోనేరులోని చేపలు శుక్రవారం మృత్యువాత పడ్డాయి. దాదాపు టన్నుకుపైగా చేపలు చనిపోయిపైకి తేలాయి. కలుషిత నీటి కారణంగా చనిపోయి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. చేపలను అలాగే వదిలేస్తే దుర్గంధం వెదజల్లే పరిస్థితి ఉన్నందున నగర పంచాయతీ అధికారులు స్పందించి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్ పెద్దయ్య బదిలీ అయ్యారు. ఉపాధ్యాయులుగా మధుసూదన్ రావు, పీ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్‌గా సీహెచ్ మనోజ్ మార్, అటెండర్‌గా సీహెచ్ శేషయ్య బాధ్యతలు స్వీకరించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని వసుంధరాదేవి శుక్రవారం సన్మానించారు.

ఆఖిరి మజిలీకి వాగు దాటాల్సిందే

- ముస్లింల శ్మశాన వాటికకు దారి సౌకర్యం కరువు
- వాగుపై వంతెన లేక వర్షాకాలంలో అగచాట్లు
- వంతెన, సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి



కంపచెట్ల మధ్యన బురదలో మృతదేహాన్ని మోసుకెళుతున్న ముస్లింలు(ఫైల్)



వాగులో మృతదేహాన్ని మోసుకెళుతున్న ముస్లింలు(ఫైల్)

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలోని ముస్లింలు అంతిమయాత్ర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సుదూరంగా ఉన్న గొట్లదిన్నె ప్రాంతంలో ముస్లింల శ్మశాన వాటిక ఉంది. అక్కడికి సరైన రహదారి సౌకర్యం లేదు. మృతదేహాన్ని ఖననం చేయాలంటే వాగు దాటాలి. దానిపై బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో నీళ్లలో మృతదేహాన్ని మోసుకెళ్లేందుకు ముస్లింలు నానాఅగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ తలరాతలు మాత్రం మారడం లేదని ముస్లింలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా వాడుకోవడమే తప్ప గెలిచిన తర్వాత తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారామపురంలో సుమారు 250 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. సుమారు 1,500 మంది జనాభా ఉన్నారు. ముస్లింలు ఎవరైనా మృతి చెందితే పడమటివీధి పైభాగంలో గొట్లదిన్నె ప్రాంతంలో ఉన్న శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేయాలి. పడమటివీధిలోని రంగుబావి వరకు రహదారి బాగానే ఉన్నా అక్కడి నుంచి సరైన దారి లేదు. కంపచెట్ల మధ్యలో నుంచి నరకయాతన పడుతూ మృతదేహాన్ని మోసుకెళ్లాల్సిన పరిస్థితి. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో రంగుబావి సమీపాన ఉన్న ఉంటమడుగు వాగు దాటాలి. వాగు నిండుగా పారితే మృతదేహాన్ని తీసుకెళ్లడం సాధ్యం కాదు. దీంతో ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియక ఆ సమయంలో ముస్లింలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథులే కరవయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే వర్షాకాలంలో తమ సామాజిక వర్గం వారు ఎవరూ మృతి చెందకూడదని భగవంతుడిని వేడుకుంటామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ముస్లిం శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో రంగుబావి సమీపానున్న వాగుపై వంతెన నిర్మించాలని, అక్కడి నుంచి శ్మశాన వాటిక వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

వంతెన నిర్మించాలి



ఎన్నో ఏళ్లుగా ముస్లిం శ్మశాన వాటికకు సరైన దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు పడి వాగు ప్రవహిస్తే మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నాం. పాలకులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలి.

– పెద్దగౌస్, సీతారామపురం

దారి సౌకర్యం కల్పించాలి



ముస్లిం శ్మశాన వాటికకు వెళ్లేందుకు రంగు బావి వద్ద నుంచి సరైన దారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. మా మొర ఆలకించే వారే కరువయ్యారు. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జితో పాటు సీసీరోడ్డు నిర్మాణం, శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి.

–కరీముల్లా, సీతారామపురం

మరోచోట స్థలం కేటాయించాలి



ముస్లిం శ్మశానవాటికకు సరైన దారిసౌకర్యం లేదు. వర్షాకాలంలో వాగు దాటాల్సి రావడంతో ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. వాగుపై వంతెన, సీసీరోడ్డు నిర్మించాలి. లేకుంటే మరోచోట శ్మశానికి స్థలాన్ని కేటాయించాలి.

– యూసుఫ్, సీతారామపురం

సమస్య పరిష్కారానికి చర్యలు



ముస్లిం శ్మశానవాటికకు వెళ్లే దారిలో వంతెనతో పాటు సిమెంట్ రోడ్డు నిర్మాణ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతాం.

– భాస్కర్, ఎంపీడీఓ, సీతారామపురం

కళాకారుడికి సన్మానం



ఉదయగిరి: కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్, కళాకారుడు సుదర్శన్‌ను సాగర్ సేవా సమితి అధ్యక్షుడు మున్నార్‌అలీ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల రోశయ్యయాదవ్, ప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌ఓ సురేష్‌యాదవ్, ఉపాధ్యాయుడు సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని వందూరుగుంటలో ఆస్తాన్ ఏ ఖాదరియా గ్యార్వీ షరీఫ్ గంధ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత ఆస్తాన్ వ్యవస్థాపకులు యూసఫ్ ఖాదరి ఇంటి వద్ద మహిళలచే సొందల్ ముబారక్ నిర్వహించారు. అనంతరం గంధం కలశాన్ని మేళతాళాలు, ఫకీరుల డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు పంచిపెట్టారు. ఆధ్యాత్మిక గురువు అబుల్ ఫతాహ్ అహమ్మద్‌బాషా ఖాదరి ఖురాన్‌లోని వచనాలను చదివి వినిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

రబీ సాగులో రైతులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

అల్లూరు: గ్రామ వ్యవసాయ సహాయకులు రబీ సాగులో రైతులకు అండగా నిలవాలని ఏడీఏ నాగరాజు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏఓ శ్రీహరితో కలిసి ఆయన గ్రామ వ్యవసాయ సహాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పంటలను నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతిరైతు బాధ్యతగా పంటలు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు.

ఇసుక ధర్నాకు తరలిన నాయకులు



నెల్లూరుకు వెళ్లేందుకు వచ్చిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



నెల్లూరులో నాయకులతో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

కావలి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉచిత ఇసుక బూటకం..చంద్రబాబు నాటకం అంటూ నెల్లూరులో శుక్రవారం చేపట్టిన ప్రదర్శనకు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లారు. పట్టణ, రూరల్ నాయకులు కావలిలోని రామిరెడ్డి నివాసానికి చేరుకుని ఆయనతో కలిసి నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉచిత ఇసుక బూటకం..చంద్రబాబు నాటకం అంటూ నెల్లూరులో శుక్రవారం చేపట్టిన ప్రదర్శనకు ఆత్మకూరు, సంగం, చేజర్ల మండలాల నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నెల్లూరులో ప్రదర్శనలో పాల్గొన్న నాయకులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

ఇంటింటి సర్వేను బాధ్యతగా చేపట్టాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి కరీష్మా

వరికుంటపాడు : మిషన్ ఇంద్రధనస్సుకు సంబంధించి ముందస్తుగా గ్రామాల్లో చేపట్టనున్న ఇంటింటి సర్వేను బాధ్యతగా నిర్వహించాలని వైద్యాధికారిణి కరీష్మా సూచించారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించని రెండు నుంచి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులను గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. వారికి మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా టీకాలను వేయించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరు డివిజన్‌కు చెందిన శ్రీధర్‌రెడ్డి వీరస్వామి, షణ్ముగం సమక్షంలో జరిగిన ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా ఎస్‌కే ఖాజావలి, అధ్యక్షుడుగా పీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎం శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా కే ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, సహకార్యదర్శులుగా సీహెచ్ చిన్నమస్తానయ్య, ఎన్ శ్రీనివాసులు, శ్రీధర్‌నాయుడు ఎన్నికయ్యారు.

కంప చెట్లా..మాకు కనిపించవు





కావలి: మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం–బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామాల నడుమ ఉన్న చిప్పలేరు బ్రిడ్జిపై మార్జిన్లలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. వాటిని తొలగించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు, నిత్యం రాకపోకలు సాగించే ఇతర శాఖల అధికారులు తమకు కనిపించడం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. కంపచెట్లు మరింత పెద్దవి అయితే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఉదయగిరి: వచ్చే నెల 4న కార్తీక సోమవారం సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం క్షేత్రానికి ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఉదయం 8 గంటలకు బస్సు బయల్దేరుతుందని చెప్పారు. ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా బస్సు వెళుతుందన్నారు. మార్గం మధ్యలో సిరిపురం గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.ఒక్కో ప్రయాణికుడికి రానుపోను టిక్కెట్ ధర రూ.1,650గా నిర్ణయించామని తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

సీతారామపురం: దీపావళికి బాణసంచా విక్రయించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయించే వారు గ్రామ శివారులోని ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రమాదాలకు తావులేకుండా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకుని విక్రయాలు చేపట్టాలని సూచించారు.

1200 జీవాలకు నట్టల నివారణ మందు

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల పరిధిలోని పామూరుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టారు. పశువైద్య సిబ్బంది 1200 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. ఎయిల్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, డక్కన్ వీల్స్ కంపెనీల సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాకు 52 మంది నిరుద్యోగులు హాజరుకాగా, 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అఫ్జల్‌ఖయ్యూం, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



మర్రిపాడు: మండలంలోని రామానాయుడుపల్లిలో వాతావరణ ఆధారిత పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆత్మ పీడీ జీ శివన్నారాయణ హాజరై ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తక్కువ వర్షపాతంతో నల్లరేగడి నేలల్లో జొన్న, మినుము, పచ్చిశనగ, ఆముదం, ఆవాలు, ధనియాలు, తదితర పంటలు, ఎర్ర నేలల్లో పెసర, పొద్దుతిరుగుడు సాగు చేసుకోవచ్చునని తెలిపారు. బోరు బావుల కింద ఆరుతడి పంటలైన వేరుశనగ, పత్తి, పొద్దుతిరుగుడు, పెసర వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఉదయగిరి ఏడీఏ పీ చెన్నారెడ్డి, ఏఓ ఎస్ రామ్మోహన్, వీఏఏ మల్లిక రైతులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మేకపాటి

కలిగిరి: స్థానిక కొత్తూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు సీత,రామలక్ష్మణుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కాగా ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డి పాల్గొని సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులు, ప్రజలతో ముచ్చటించారు. కోదండరాముని దయతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

- పంచాయతీ తీర్మానం లేకుండానే సీసీ రోడ్లు ఎలా వేస్తారు?
- పీఆర్ ఏఈని నిలదీసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- సర్పంచ్‌లను బొమ్మల్లా చూడడం తగదని మండిపాటు



వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ సర్పంచ్

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. తొలుత శాఖల వారీగా అధికారులు మండలంలో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్ ఏఈ వాణి మండలంలోని 19 పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ పథం కింద రూ.2.40కోట్లతో సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. పంచాయతీ తీర్మాణం లేకుండా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడంపై వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లు పరుచూరి మాల్యాద్రి, దార్ల గోపి, ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం అవసరం లేదా..సర్పంచ్‌లకు సంబంధం ఉందా..లేదా.. వారి సంతకం అవసరం లేదా అని ఏఈని ప్రశ్నించారు. పంచాయతీల్లో ఎక్కడ సీసీరోడ్లు అవసరమో ప్రజాప్రతినిధులకు తెలుస్తుందని, అధికారులకు ఏమి తెలుస్తుందని, గత ప్రభుత్వాలు సర్పంచ్‌లను బొమ్మల్లా చూడలేదని మండిపడ్డారు. అదే సభలో ఉన్న టీడీపీ మద్దతు గుడవల్లూరు సర్పంచ్ బద్దెపూడి మాచర్ల కలుగజేసుకుని వారితో వాగ్వివాదానికి దిగారు. స్పందించిన పీఆర్ ఏఈ వాణి మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి పీపీ ఈఈకి, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తమకు టీడీపీ వారు చెప్పినట్లే సీసీరోడ్లు వేయాలని ఆదేశాలు ఇచ్చారని సమాధానం చెప్పింది. వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లు సంబంధిత జీఓ కాపీని తమకివ్వాలని డిమాండ్ చేయగా, అలాంటి కాపీ లేదని సమాధానం ఇచ్చారు. అనంతరం చింతలదేవి ఎంపీటీసీ సభ్యుడు మేకల కొండలరావు మాట్లాడుతూ గతంలో చేసిన జలసిరి పనులు నాసిరకంగా ఉన్నాయని, గ్రామాల్లో ఇంటింటికి నీరు సరఫరా కావడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీబాషా దృష్టికి తీసుకొచ్చారు. ఎంఈఓ ఆనందరావు, ఈఓపీఆర్డీ నారాయణ, ఏఓ శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దుత్తలూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు



వరికుంటపాడు మండలం కాంచెరువులో..

దుత్తలూరు: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యనమల నాగరాజు తెలిపారు. మండలంలోని మందాలపల్లిలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. రీసర్వేలో దొర్లిన తప్పొప్పులు సవరణకు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. సర్పంచ్ కొండారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని కాంచెరువు గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ చెంచయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో దొర్లిన తప్పొప్పులపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. పది రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీఆర్వో ఆదినారాయణ, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడులో తహసీల్దార్ మస్తానయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో దొర్లిన తప్పొప్పులు, అభ్యంతరాలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సుమారు 50 మందికిపైగా రైతులు అర్జీలు అర్జీలు అందజేశారు. విస్తీర్ణం తగ్గిందని, పట్టాదారు పేరు మారిందని, ఉమ్మడి ల్యాండ్ పాస్‌బుక్‌లు వచ్చాయని, తదితర సమస్యలపై అర్జీలు అందాయని, వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్ రాధాకృష్ణ,, వీఆర్వో మహేష్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఉదయగిరి: విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచి చూశారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆపార్ నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం నూర్జహాన్, షకీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.